RNI NO:APTEL /2023/90201

# రాజధాని వాయిస్

తెలుగు దినపత్రిక

web : www.rajadhanivoice.in    rajadhanivoicedaily@gmail.com

సంపుటి : 02 | సంచిక : 306 | 27 ఆదివారం సెప్టెంబరు 2026 | ఎడిటర్ : పాగళ్ల పూర్ణచంద్రరావు | పేజీలు : 4 | వెల : రూ.1/-

RAJADHANI VOICE రాజధాని వాయిస్ TELUGU DAILY

విలేఖరులు కావలెను

రాజధాని వాయిస్ తెలుగు దినపత్రికలో కొనసాగుటకు
గుంటూరు,పల్నాడు,జిల్లాలలో స్టాఫర్లు
నియోజకవర్గాలకు ఇంచార్జులు మరియు
మండలాల వారిగా విలేఖరులు కావవలెను
ఆసక్తి గలవారు సంప్రదించగలరు.
9030343195
అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును

## కాంగ్రెస్‌తో కలవాలనే ఉద్దేశంతోనే జగన్ వైఖరి మార్చుకుంటున్నారా?: శ్రీకృష్ణదేవరాయలు

**ఓటర్ల జాబితా సవరణపై జగన్ ది ద్వంద్వ వైఖరి అంటూ ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు ఫైర్**
**గతంలో కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటమేంటని ప్రశ్న**
**ఈసీల నియామకంపై మాట మార్చడం వెనుక ఆంతర్యమేమిటని నిలదీత**
**2029లో కాంగ్రెస్‌తో పొత్తు కోసమే జగన్ వ్యూహాలని ఆరోపణ**



**అమరావతి, రాజధాని వాయిస్ :** వైసీపీ అధినేత జగన్ పై టీడీపీ ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. జగన్‌ది అవకాశవాద, ద్వంద్వ వైఖరి అని ఆరోపిస్తూ సోషల్ మీడియా వేదికగా పలు కీలక ప్రశ్నలు సంధించారు. ఆయన రాజకీయ సౌలభ్యం కోసం వైఖరులు మార్చుకుంటున్నారని ఘాటుగా విమర్శించారు.ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై ఇప్పుడు ఆరోపణలు చేస్తున్న జగన్, గతంలో స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఇదే ప్రక్రియను ప్రామాణికంగా తీసుకున్నారని లావు గుర్తుచేశారు."ఎస్ఐఆర్ పూర్తయ్యాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని మీ పార్టీ ఎమ్మెల్సీ లెల్ల అప్పిరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం వాస్తవం కాదా? కోర్టులో ఒకలా, ఇప్పుడు మరోలా మాట్లాడటంలోని ఆంతర్యమేమిటి?" అని ఆయన ప్రశ్నించారు.అదేవిధంగా, ఎన్నికల కమిషనర్ల నియామక ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని (సీజేఐ) తొలగిస్తూ 2023లో కేంద్ర ప్రభుత్వం తెచ్చిన చట్టానికి వైసీపీ మద్దతు ఇచ్చిందని లావు పేర్కొన్నారు. కానీ ఇప్పుడు, ప్రధాని, ప్రతిపక్ష నేతతో పాటు సీజేఐ కూడా ప్యానెల్‌లో ఉండాలని జగన్ డిమాండ్ చేయడం ఆయన ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు.ఈ ఆకస్మిక మార్పుల వెనుక రాజకీయ వ్యూహం ఉందని లావు అనుమానం వ్యక్తం చేశారు. 2029 ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, తన మాతృ సంస్థ అయిన కాంగ్రెస్‌తో రాజకీయంగా కలవాలనే ఉద్దేశంతోనే జగన్ ఇలా తన వైఖరిని మార్చుకుంటున్నారా? అని ఆయన సూటిగా ప్రశ్నించారు.

## ఈసీ ప్రకటనతో అపోహలకు తెరపడింది: సీఎం చంద్రబాబు

**అమరావతి, రాజధాని వాయిస్ :** భారత ఎన్నికల సంఘం (ఈసీఐ)లో కమిషనర్ల మధ్య విభేదాలు తలెత్తాయంటూ వచ్చిన వార్తలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పందించారు. ఇవాళ ఓ కీలక సమావేశం సందర్భంగా ఈసీ ఇచ్చిన ఏకగ్రీవ ప్రకటనతో అన్ని అపోహలకు తెరపడిందని ఆయన పేర్కొన్నరు. మన రాజ్యాంగ సంస్థల సమగ్రతను, విశ్వసనీయతను ఈ ప్రకటన మరోసారి స్పష్టం చేసిందని ఎక్స్ వేదికగా శనివారం ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ అంశంపై నెలకొన్న వివాదం తాజాగా ఈసీ వివరణతో ముగిసిందని తెలిపారు.స్వల్పకాలిక రాజకీయ ప్రయోజనాల కోసం భారత ప్రజాస్వామ్య వ్యవస్థ, ఎన్నికల ప్రక్రియలపై ప్రజల్లో ఉన్న విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రయత్నాలు చేయడం దురదృష్టకరమని చంద్రబాబు అభిప్రాయపడ్డారు. ఎన్నికల ఫలితాలు ప్రజల తీర్పును ప్రతిబింబిస్తాయని, బలమైన ప్రజాస్వామ్యంలో గెలుపును, ఓటమిని సమానంగా, హుందాగా స్వీకరించడమే నిజమైన నాయకత్వ లక్షణమని హితవు పలికారు. రాజ్యాంగ సంస్థలను గౌరవించడం అత్యంత ముఖ్యమని, భారత ప్రజాస్వామ్య ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టడం పార్టీలకు అతీతంగా నాయకులందరి ఉమ్మడి బాధ్యత అని ఆయన గుర్తుచేశారు.

**సంయుక్త ప్రకటనతో వివాదానికి ముగింపు**

కాగా, గత కొద్ది రోజులుగా తమ మధ్య తీవ్ర విభేదాలు ఉన్నాయంటూ వస్తున్న ఊహాగానాలకు భారత ఎన్నికల సంఘం పూర్తిస్థాయి కమిషన్ శనివారం తెరదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి న్యూఢిల్లీలోని నిర్వాచన్ సదన్‌లో సమావేశమయ్యారు. అనంతరం ముగ్గురూ కలిసి ఉన్న ఫోటోతో పాటు ఒక సంయుక్త ప్రకటనను విడుదల చేశారు. కమిషన్ అంతర్గత పనితీరు, ఓటర్ల జాబితా సవరణ, సాంకేతిక వ్యవస్థలపై వస్తున్న ఆరోపణలను తీవ్రంగా ఖండించారు.

**వివాదానికి నేపథ్యం ఇదే..**

ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణకు సంబంధించిన పలు నిర్ణయాలపై కమిషనర్లు సంధు, జోషి అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ సెప్టెంబర్ 23న ఓ ప్రముఖ ఆంగ్ల పత్రికలో కథనం ప్రచురితమైంది. ఈ కథనం దేశవ్యాప్తంగా రాజకీయ దుమారం రేపింది. ప్రతిపక్ష పార్టీలు ఎన్నికల సంఘం పనితీరుపై సందేహాలు వ్యక్తం చేస్తూ, మరింత పారదర్శకత అవసరమని డిమాండ్ చేశాయి. ఈ నేపథ్యంలోనే పూర్తిస్థాయి కమిషన్ సంయుక్తంగా స్పందించి, తమ మధ్య



ఎలాంటి విభేదాలు లేవని స్పష్టం చేసింది. రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కోసం 2025 జూన్ 24న జారీ చేసిన ఆదేశాలను ముగ్గురు కమిషనర్లు ఏకగ్రీవంగా ఆమోదించారని ఈసీ తన ప్రకటనలో పేర్కొంది. ఆ తర్వాత కార్యక్రమ షెడ్యూళ్లను కూడా ఏకాభిప్రాయంతోనే విడుదల చేశామని తెలిపింది. ఈ ఆదేశాలను సుప్రీంకోర్టు సైతం సమర్థించిందని గుర్తుచేసింది. నిర్ణయాలన్నీ సమష్టిగా, సంస్థాగత విధివిధానాలను అనుసరించే తీసుకుంటామని కమిషన్ స్పష్టం చేసింది.



**మంగళగిరి, రాజధాని వాయిస్ :** వైసీపీ అధినేత జగన్‌కు హిందువులన్నా, హిందూ సంప్రదాయాలన్నా గిట్టదని, అందుకే ప్రకాశం జిల్లాలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు రంగు పడిందంటూ ఫేక్ ప్రచారం చేస్తున్నారని సీడాప్ చైర్మన్ దీపక్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మంగళగిరిలోని ఎన్టీఆర్ భవన్‌లో శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడారు. ప్రకాశం జిల్లా ఉమామహేశ్వరపురంలో వైఎస్సార్ విగ్రహంపై పసుపు పడిందనే నెపంతో, ఒక టీడీపీ నాయకుడిని బెదిరించి, బలవంతంగా విగ్రహాన్ని నీటితో కడిగించి, దాన్ని వీడియో తీసి వైసీపీ నేతలు రాక్షసానందం పొందారని ఆయన మండిపడ్డారు."హిందువులు శుభకార్యాలకు ప్రతీకగా భావించే పసుపు రంగు అంటే వైసీపీ నాయకులకు ఎందుకంత కోపం? విగ్రహంపై పసుపు పడితే, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి గానీ, దారికాచి ఒక వ్యక్తిని బెదిరించి ఇలాంటి చర్యలకు పాల్పడటం దారుణం. ఇది కేవలం ఒక టీడీపీ నాయకుడిపై జరిగిన దాడి కాదు, యావత్ హిందూ సమాజంపై జరిగిన దాడిగా పరిగణించాలి" అని దీపక్ రెడ్డి వ్యాఖ్యానించారు. వైసీపీ నేతల ఇలాంటి దౌర్జన్యపూరిత ప్రవర్తనను చూసే 2024 ఎన్నికల్లో ప్రజలు ఆ పార్టీని ఘోరంగా ఓడించారని, అయినా వారిలో మార్పు రాలేదని విమర్శించారు. భవిష్యత్తులోనూ ఇదే వైఖరి కొనసాగిస్తే పార్టీ మనుగడే ప్రశ్నార్థకమవుతుందని హెచ్చరించారు.

**వైసీపీ హయాంలో ఆలయాలపై దాడులు**

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో హిందువుల మనోభావాలను దెబ్బతీసే అనేక సంఘటనలు జరిగాయని దీపక్ రెడ్డి గుర్తుచేశారు. "శ్రీశైలం నుంచి రామతీర్థం వరకు దాదాపు 300 దేవాలయాలపై దాడులు జరిగాయి. అంతర్వేది రథం దగ్ధం నుంచి రామతీర్థంలో రాముడి విగ్రహ శిరస్సు ఖండన వరకు ఎన్నో దుశ్చర్యలకు పాల్పడ్డారు.

## ఓటరు జాబితాపై కొత్త నిర్ణయాలు

**న్యూఢిల్లీ, రాజధాని వాయిస్ :** దేశ ఎన్నికల సంఘం శనివారం మధ్యాహ్నం నిర్వహించిన కీలక సమావేశంలో ఓటరు జాబితాల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, ప్రజలకు మరింత సౌలభ్యం కల్పించే అంశాలపై పలు నిర్ణయాలు తీసుకుంది. ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక పరిశీలన ప్రక్రియలో గుర్తించిన సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు అధికారులకు స్పష్టమైన మార్గదర్శకాలు జారీ చేసింది. ఓటర్లకు ఇబ్బందులు లేకుండా సేవలు అందించడమే ప్రధాన లక్ష్యమని ఎన్నికల సంఘం పేర్కొంది.ప్రత్యేక పరిశీలనలో భాగంగా నోటీసులు అందుకున్న వ్యక్తుల విషయంలో ఇకపై క్షేత్రస్థాయిలోనే చర్యలు చేపట్టనున్నారు. సంబంధిత అధికారులు నేరుగా వారి ఇళ్లకు వెళ్లి అవసరమైన పత్రాలను సేకరించి వ్యవస్థలో నమోదు చేస్తారు. అనంతరం ఎన్నికల నమోదు అధికారుల పరిశీలనకు పంపిస్తారు. దీంతో సాధారణ ప్రజలు కార్యాలయాలకు వెళ్లి హాజరు కావాల్సిన అవసరం తగ్గనుంది. అత్యవసర పరిస్థితులు మినహా వ్యక్తిగత విచారణలను కార్యాలయాల్లో నిర్వహించకుండా సాధ్యమైనంత వరకు అంతర్జాలం ద్వారా నిర్వహించాలని నిర్ణయించారు. అవసరమైతే ఓటరు తరఫున కుటుంబంలోని ఏదైనా పెద్ద సభ్యుడు హాజరయ్యే అవకాశాన్ని కూడా కల్పించారు. ఇందుకోసం అంతర్జాల సౌకర్యాలను మరింత బలోపేతం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.రాత్రి ఆశ్రయ కేంద్రాల్లో నివసించే వారు, కూలీలు, పేదలు, నిరాశ్రయులు వంటి వర్గాలు ఓటరు జాబితాలో చేరేందుకు జిల్లా స్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. అవసరమైన చోట ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికీ నమోదు అవకాశాలు కల్పించాలని ఎన్నికల సంఘం ఆదేశించింది. ఎవరూ ఓటరు హక్కుకు దూరం కాకూడదనే ఉద్దేశంతో ఈ చర్యలు చేపడుతున్నట్లు తెలిపింది.ప్రత్యేక పరిశీలన ప్రక్రియ ఇప్పటికే బీహార్, పశ్చిమ బెంగాల్‌తో పాటు ఇరవై రాష్ట్రాలు,




కేంద్ర పాలిత ప్రాంతాల్లో పూర్తయిందని ఎన్నికల సంఘం వెల్లడించింది. అయినప్పటికీ ఏదైనా కారణంతో పేరు నమోదు కాకపోయిన వారు లేదా తొలిసారి ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లను ఎప్పుడైనా నమోదు చేసుకునే అవకాశం ఉందని స్పష్టం చేసింది. నిరంతర నవీకరణ ప్రక్రియ ద్వారా ఈ దరఖాస్తులను స్వీకరించనున్నట్లు తెలిపింది. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను మరింత వేగవంతం చేయడానికి రాష్ట్ర స్థాయి, జిల్లా స్థాయి, నియోజకవర్గ స్థాయి అధికారులకు ప్రత్యేక ఆదేశాలు జారీ చేశారు. యువ ఓటర్లు, ఇప్పటివరకు నమోదు కాని అర్హులైన పౌరులను గుర్తించి జాబితాలో చేర్చేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడి ఓటు నమోదు కావడం అత్యంత ముఖ్యమని ఎన్నికల సంఘం పేర్కొంది.

## విజయ్ సినిమాలు మానేశారని ఎవరు చెప్పారు?: స్టాలిన్



టీవీకే అధినేత విజయ్‌పై డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ విమర్శలు గుప్పించారు. సినిమాలు మానేశానని విజయ్ చెబుతున్నప్పటికీ.. ప్రజల ముందు ఇంకా నటిస్తూనే ఉన్నారని ఎద్దేవా చేశారు. మదురాంతకం ఉపఎన్నిక ప్రచారంలో విజయ్ నటించడం తాను చూశానన్నారు. టీవీకేను 'స్వచ్ఛమైన శక్తి'గా, డీఎంకేను 'దుష్ట శక్తి'గా విజయ్ చేసిన వ్యాఖ్యలను స్టాలిన్ తప్పుబట్టారు. ప్రభుత్వంపై విజయ్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని పేర్కొంటూ, సీఎం హోదాకు తగిన రాజకీయ సంయమనం పాటించాలని సూచించారు. జెమ్ గ్రానైట్స్ ఛైర్మన్ ఆర్.వీరమణికి సంబంధించిన పోక్సో కేసులో డీఎంకేపై విజయ్ చేస్తున్న ఆరోపణలు అవాస్తవమని స్టాలిన్ పేర్కొన్నారు. ఈ అంశంపై అసెంబ్లీలో ఇప్పటికే తన వైఖరిని స్పష్టం చేశానన్నారు. దర్యాప్తు అంశాలను రాజకీయంగా ఉపయోగించుకోవద్దని మద్రాస్ హైకోర్టు ఆదేశించినప్పటికీ.. ఎన్నికల ప్రచారంలో విజయ్ ఈ అంశాన్ని ప్రస్తావిస్తున్నారని విమర్శించారు. సీఎం హోదాకు తగిన రాజకీయ సంయమనం పాటించాలని విజయ్‌కు స్టాలిన్ సూచించారు. ప్రజల ముందు నటించకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన వ్యాఖ్యానించారు.

## భారీ వర్షాలపై సీఎం సమీక్ష సమావేశం

**- ఉత్తరాంధ్ర వరద పరిస్థితులపై ప్రత్యేక దృష్టి**
**- ముంపు ప్రాంతాల్లో పునరావాస చర్యలు వేగవంతం**



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలు, ఉత్తరాంధ్రలో నెలకొన్న వరద పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ప్రధాన కార్యదర్శి సాయిప్రసాద్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో వర్షాల ప్రభావం, నదుల ప్రవాహాలు, ముంపు ప్రాంతాల పరిస్థితిపై సమగ్రంగా చర్చించారు. పలు జిల్లాల్లో నివాస ప్రాంతాలు జలమయం కావడం, పంటలు నీటమునగడం వంటి అంశాలపై అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు. వరదల కారణంగా ప్రభావితమైన ప్రాంతాల్లో సహాయక చర్యలు, పునరా వాస కార్యక్రమాలను మరింత వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన ఆహారం, తాగునీరు, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా పనిచేయాలని స్పష్టం చేశారు.ఉత్తరాంధ్ర జిల్లాల్లో నదుల ప్రవాహం, వరద పరిస్థితులను మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువచ్చారు. వివిధ ప్రాంతాల్లో వరద నీటి ప్రభావం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై వివరించారు. అదే సమయంలో ఇరిగేష న్ శాఖ అధికారులు జిల్లాల వారీగా రిజర్వాయర్లలోకి వస్తున్న నీటి ప్రవాహాలు, నిల్వల పరిస్థితిని వివరించారు. అవసరమైన చోట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. గత ఐదు రోజులుగా సముద్రంలోకి వెళ్లలేక ఉపాధి కోల్పోయిన మత్స్యకార కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలవాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. అర్హులైన ప్రతి మత్స్యకార కుటుంబానికి 50 కిలోల ఉచిత బియ్యం అందించాలని అధికారులను ఆదేశించారు. తుఫాను, వర్షాల ప్రభావంతో ఇబ్బందులు పడుతున్న కుటుంబాలకు ఈ సహాయం తక్షణ ఉపశమనాన్ని కలిగిస్తుందని పేర్కొన్నారు.హీర మండలం ఎత్తిపోతల పథకానికి విద్యుత్ సౌకర్యం కల్పించే ప్రక్రియను అత్యవసరంగా పూర్తి చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. విద్యుత్ శాఖ, నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు పరస్పర సమన్వయంతో పనులు వేగవంతం చేయాలని సూచించారు. ఎత్తిపోతల పథకం పనులు పూర్తయితే వంశధార జలాలను హీర మండలం రిజర్వాయ ర్‌కు తరలించే అవకాశం కలుగుతుందని వివరించారు. రాష్ట్రంలోని వివిధ రిజర్వాయర్లను పూర్తిస్థాయిలో నింపేందుకు చేపడుతున్న చర్యలపై కూడా ముఖ్యమంత్రి అధికారులతో సమీక్షించారు.

## అమరావతిలో గ్రామకంఠం భూములపై సీఆర్‌డీఏ స్పష్టత



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాజధాని అమరావతి పరిధిలో గ్రామకంఠం మినహాయింపులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. 08-12-2014ను కటాఫ్ తేదీగా తీసుకుని.. ఆ తేదీకి ముందే నిర్మాణాలు ఉన్న భూములు, చదరపు గజాల ప్రాతిపదికన రిజిస్ట్రేషన్లు జరిగిన ప్లాట్లను నిబంధనల ప్రకారం మినహాయింపునకు పరిగణించినట్లు తెలిపింది. గ్రామ నివాస ప్రాంతానికి దూరంగా ఉన్న ఖాళీ వ్యవసాయ భూములు, కటాఫ్ తేదీ తర్వాత రిజిస్ట్రేషన్లు జరిగిన భూములకు మినహాయింపు వర్తించదని స్పష్టం చేసింది. ఇప్పటికే 6,473.72 ఎకరాలను ఎల్‌పీఎస్ నుంచి మినహాయించగా.. అపరిష్కృత దరఖాస్తుల పరిశీలనకు ప్రభుత్వం 2026 జనవరిలో జిల్లా స్థాయి కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీకి వచ్చిన 685 దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, రికార్డులు, శాటిలైట్ చిత్రాలు, రిజిస్ట్రేషన్ వివరాల ఆధారంగా నిర్ణయాలు తీసుకున్నట్లు వెల్లడించింది. రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిబంధనల ప్రకారం అర్హులకు అన్ని ప్రయోజనాలు అందిస్తామని సీఆర్డీఏ స్పష్టం చేసింది.

## స్థానిక ఎన్నికలపై కూటమి భేటీ.. సమన్వయంతో పనిచేయాలని మంత్రుల పిలుపు

**విజయవాడ, రాజధాని వాయిస్ :** బాపట్ల పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలోని రేపల్లె, బాపట్ల, చీరాల అసెంబ్లీ నియోజకవర్గాల కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి కొలుసు పార్థసారథి, మంత్రి అనగాని సత్య ప్రసాద్ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికలలో కలిసి పని చేసేలా సమన్వయ కమిటీలు వేశారని.. ఈరోజు సమావేశమై కార్యాచరణపై చర్చించినట్లు తెలిపారు. గతంలో ఎవరూ చేయని విధంగా కూటమి ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమం, ఉద్యోగాలు ఇచ్చిందన్నారు. గెలుపే లక్ష్యంగా ఒకచోట ఒకరు తగ్గినా, మరొక చోట ఇంకొకరు తగ్గేలా సమన్వయం చేస్తామని చెప్పారు.వైసీపీకి అసలు ఎన్నికలలో పోటీ చేసే అర్హత లేదని మంత్రి విమర్శించారు. ప్రజలు ఓట్లు వేసి గెలిపించిన వైసీపీ ఎమ్మెల్యేలు అసెంబ్లీకి రావడంలేదని.. ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. శాసనమండలిలో మాత్రం సంఖ్యా బలం ఉందని వచ్చి గందరగోళం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వారు పోటీపై పునరాలోచన చేసుకోవాలని హితవుపలికారు. ఐదేళ్లల్లో ఒక్క ప్రాజెక్టు కూడా వాళ్లు పూర్తి చేయలేదన్నారు. గత వైసీపీ హయాంలో ఏయే మున్సిపాలిటీకి ఎన్ని నిధులు ఇచ్చారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ రెండేళ్ల కాలంలో మున్సిపాలిటీలో రూ.70 కోట్ల అభివృద్ధి పనులు చేశామని వివరించారు. మరో రూ.140 కోట్లు తెచ్చేలా కేంద్రానికి ప్రతిపాదనలు పంపామన్నారు.కూటమి పార్టీ నేతల మధ్య సమైక్యత ఉందని పార్థసారథి వెల్లడించారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్ చూపే స్ఫూర్తితో 94 శాతానికి మించి విజయం సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. తాము యూనానిమస్ అని ఎక్కడా చెప్పలేదని... వాళ్లే భయపడి మాట్లాడుతున్నారని తెలిపారు. టీచర్ల ఉద్యమంలో గంజాయి బ్యాచ్, రౌడీలు, గుడ్లతో దాడులు చేయిస్తారా అంటూ ఫైర్ అయ్యారు. వాళ్లపై వాళ్లకే నమ్మకం లేకే ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికలలో కూటమి అభ్యర్థుల విజయం ఖాయమని మంత్రి కొలుసు పార్థసారథి స్పష్టం చేశారు.

**స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యం: మంత్రి అనగాని**

నేడు బాపట్ల పార్లమెంటు నియోజకవర్గం కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశం జరిగిందని మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్ పదేళ్లు రాష్ట్రాన్ని వెనక్కి తీసుకెళ్లారని విమర్శించారు. ప్రధాని నరేంద్ర మోదీ, సీఎం చంద్రబాబు.. సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా ముందుకు తీసుకెళుతున్నారని అన్నారు. గెలుపే లక్ష్యంగా స్థానిక సంస్థల ఎన్నికలలో అందరం కలిసి పని చేయాలని నిర్ణయించామన్నారు. పవన్ కల్యాణ్ పల్లె వెలుగు ద్వారా గ్రామాలను అభివృద్ధి చేశారని తెలిపారు. వచ్చే ఎన్నికలలో ప్రజల ఆశీర్వాదంతో కూటమి అభ్యర్థులు విజయం సాధిస్తారని మంత్రి అనగాని సత్యప్రసాద్ ధీమా వ్యక్తం చేశారు.

## రాష్ట్రంలో విధ్వంసం సృష్టించాలని చూస్తున్న గొడ్డలి పార్టీ: మంత్రి డోలా



**అమరావతి, రాజధాని వాయిస్ :** రాష్ట్రంలో గొడ్డలి పార్టీ విధ్వంసం సృష్టించాలని చూస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి విమర్శించారు. యువతకు ఉద్యోగాలు ఇవ్వడమే కూటమి ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంటే.. రాజకీయంగా అడ్డంకులు సృష్టించడమే వైసీపీ లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. శనివారం రాజధాని అమరావతిలో ఆయన మాట్లాడుతూ.. గురువులను గౌరవించాల్సిన సమాజంలో టీచర్లపైనే దాడులకు పాల్పడటం అత్యంత దురదృష్టకరమని పేర్కొన్నారు. టీచర్లపై, ప్రభుత్వ కార్యాలయాలపై దాడులకు దిగడం ప్రజాస్వామ్య పద్ధతి కాదని వైసీపీ నేతలకు సూచించారు. రాజకీయంగా బలహీనపడుతున్న కొద్దీ వైసీపీ రోడ్లపై ఆందోళనలతో తన ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. ఓ అబద్ధాన్ని పదే పదే చెప్పి నిజమని నమ్మించే దుష్ట సంప్రదయాన్ని మళ్ళీ అమలు చేస్తుందంటూ వైసీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు.డీఎస్సీని పారదర్శకంగా నిర్వహిస్తే.. రోజుకో కొత్త ఆరోపణలతో వైసీపీ నేతలు రాజకీయ డ్రామాలు చేస్తున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఓ రోజు పేపర్ లీక్ అంటారు.. మరో రోజు స్పోర్ట్స్ కోటాలో అక్రమాలు అంటారు.. ఇంకోరోజు కులం పేరుతో ఆరోపణలు చేస్తారని వైసీపీ నేతల తీరును ఈ సందర్భంగా మంత్రి డోలా బాల వీరాంజనేయులు ఎండగట్టారు. ఒకే ఆరోపణను పదే పదే చెప్పి నిజం చేయాలన్న వైసీపీ ప్రయత్నాలను ప్రజలు నమ్మడం లేదని అన్నారు. డీఎస్సీపై నిజంగా అనుమానాలుంటే ఆధారాలు బయటపెట్టాలని వైసీపీ నేతలను ఆయన డిమాండ్ చేశారు.నిన్న మీ మాజీ శాసనసభ్యుడు మాట్లాడుతూ.. మీకు రెండేళ్లు పట్టింది.. మేం నెలలోనే మీ అంతు తెలుస్తామని అంటున్నారని.. అంటే రౌడీలు, గుండాలని మీకు మీరే సర్టిఫికెట్ ఇచ్చుకున్నారని వైసీపీ నేతలకు ఆయన స్పష్టం చేశారు. రాజకీయ పార్టీ ముసుగులో నేరస్థులను కాపాడుతూ.. నేరాలను ప్రోత్సహిస్తూ.. రాష్ట్రంలో ఆస్తులు ధ్వంసం చేస్తూ, లా అండ్ ఆర్డర్ సమస్యను సృష్టిస్తున్నారంటూ వైసీపీ నేతలపై ఆయన నిప్పులు చెరిగారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించడమే వైసీపీ వ్యూహంలా ఉందని ఆయన సందేహం వ్యక్తం చేశారు. వైసీపీ పార్టీ దుకాణం మూసేసుకునే రోజు త్వరలోనే ఉందని జోస్యం చెప్పారు. వేలాది అభ్యంతరాలు, కోర్టు ప్రక్రియలు, అన్ని అడ్డంకులు దాటుకుని16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేశామని వివరించారు. ప్రజలకు వాస్తవాలు చెప్పకుండా కార్యకర్తలను రెచ్చగొట్టి రోడ్లపైకి తీసుకురావడం మానుకోవాలంటూ వైసీపీ నేతలను మంత్రి డోలా హితవు పలికారు. అసత్యాలు, ఆరోపణలు, ఆందోళనలతో యువత భవిష్యత్తును రాజకీయం కోసం ఉపయోగించుకోవద్దని వైసీపీ నేతలకు ఆయన స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగాల క్యాలెండర్‌తో యువతకు భరోసా కల్పించే దిశగా ముందుకు వెళ్తోందని మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయులు పేర్కొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికలపై ఎన్డీఏ కూటమి సమన్వయ సమావేశం

- అనకాపల్లిలో కూటమి నేతల సమావేశం- ఎన్నికల వ్యూహాలపై విస్తృత చర్చ - అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష - సమన్వయంతో ముందుకు సాగాలని పిలుపు - మంత్రి కొల్లు రవీంద్ర






**అనకాపల్లి, సెప్టెంబర్ 26 :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో అనకాపల్లి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఎన్డీఏ కూటమి నేతల సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్రతో పాటు కూటమి భాగస్వామ్య పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.సమావేశంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన వ్యూహాలు, కూటమి సమన్వయం, అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై విస్తృతంగా చర్చించినట్లు తెలిపారు. గత రెండేళ్లలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, అమలు చేసిన సంక్షేమ పథకాల వివరాలను ప్రజల్లోకి తీసుకెళ్లే అంశంపై కూడా చర్చ జరిగినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ కూటమి నాయకుల మధ్య సమన్వయం కొనసాగాలని సూచించినట్లు తెలిపారు. స్థానిక స్థాయిలో ఏర్పడే సమస్యలను పరస్పర చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని, ఎన్నికల సమయంలో ఐక్యతతో పనిచేయాలని పిలుపునిచ్చినట్లు సమాచారం. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఎంపిక విషయంలో కూడా చర్చ జరిగినట్లు సమావేశంలో పాల్గొన్న నాయకులు తెలిపారు. స్థానిక పరిస్థితులు, ప్రజాభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను నిర్వహించే అంశంపై అభిప్రాయాలు వ్యక్తమైనట్లు పేర్కొన్నారు.స్థానిక సంస్థల ఎన్నికలను సమన్వయంతో ఎదుర్కొనేందుకు కూటమి నాయకులు కార్యాచరణపై చర్చించినట్లు సమాచారం. ప్రజలతో మరింత చేరువ కావడం, స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వడం వంటి అంశాలు సమావేశంలో ప్రస్తావనకు వచ్చినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణ మూర్తి, కె.ఎస్.ఎన్.ఎస్. రాజు, పంచకర్ల రమేష్, సుందరపు విజయ్ కుమార్, వంశీకృష్ణ శ్రీనివాస్, స్థానిక సంస్థల ఎన్నికల పరిశీలకుడు కొండపల్లి అప్పలనాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్య బాబు, కార్పొరేషన్ చైర్మన్లు పీలా గోవింద సత్యనారాయణ, ప్రగడ నాగేశ్వరరావు తదితర కూటమి నాయకులు పాల్గొన్నారు.

## జ్యుడిషియల్ వర్క్‌షాప్‌కు న్యాయమూర్తుల రాక

- కడపలో జ్యుడిషియల్ వర్క్‌షాప్ నిర్వహణ
- హైకోర్టు న్యాయమూర్తులకు ఘన స్వాగతం
- పూల మొక్క అందజేసిన కలెక్టర్
- న్యాయ వ్యవస్థ బలోపేతంపై చర్చలు





**కడప, రాజధాని వాయిస్ :** వైఎస్ఆర్ కడప జిల్లాలో నిర్వహించనున్న జ్యుడిషియల్ వర్క్‌షాప్--3 కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ టి. రాజశేఖర్ రావు, జస్టిస్ ఎం. బాలాజీలకు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మర్యాదపూర్వక స్వాగతం పలికారు. కడప స్టేట్ గెస్ట్ హౌస్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో న్యాయమూర్తులను కలుసుకుని పూల మొక్కను అందజేశారు. జ్యుడిషియల్ వర్క్‌షాప్--3కు జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి, వర్క్‌షాప్ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న జస్టిస్ టి. రాజశేఖర్ రావు ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అలాగే రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. బాలాజీ గౌరవ అతిథిగా పాల్గొననున్నారు. న్యాయ వ్యవస్థకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చలు జరగనున్నట్లు సమాచారం.న్యాయ సేవల నాణ్యత పెంపు, పెండింగ్ కేసుల పరిష్కారం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, న్యాయ పరిపాలనలో సమర్థత వంటి అంశాలపై ఈ వర్క్‌షాప్‌లో విస్తృతంగా చర్చించే అవకాశం ఉంది. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సంబంధిత శాఖల ప్రతినిధులు ఇందులో పాల్గొననున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి న్యాయమూర్తులకు జిల్లావాసుల తరఫున స్వాగతం పలికారు. న్యాయ వ్యవస్థ బలోపేతానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు. జిల్లా యంత్రాంగం తరఫున వర్క్‌షాప్ విజయవంతానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టినట్లు తెలిపారు.కడప జిల్లాలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా న్యాయ వ్యవస్థ పనితీరు మరింత మెరుగుపడటంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయం అందించే దిశగా కొత్త ఆలోచనలు వెలువడే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. న్యాయ పరిపాలనలో ఉత్తమ విధానాల అమలుపై కూడా చర్చలు జరిగే అవకాశముంది. జిల్లాలో జరుగుతున్న ఈ జ్యుడిషియల్ వర్క్‌షాప్ న్యాయ రంగానికి ఉపయోగకరమైన వేదికగా నిలుస్తుందని అధికారులు పేర్కొన్నారు. కార్యక్రమానికి హాజరైన న్యాయమూర్తులకు జిల్లా యంత్రాంగం తరఫున ఘన స్వాగతం పలుకుతూ, వర్క్‌షాప్ విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధం సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి



**అమరావతి, రాజధాని వాయిస్ :** డీఎస్సీ నియామకాలపై సీబీఐ విచారణ జరిపించాలంటూ వైసీపీ చేస్తున్న డిమాండ్‌పై సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఘాటుగా స్పందించారు. డీఎస్సీ ప్రక్రియ అత్యంత పకడ్బందీగా జరిగిందని.. 16,372 ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో ఎక్కడా అక్రమాలకు తావివ్వలేదని స్పష్టం చేశారు. సీబీఐపై వైసీపీకి అంత నమ్మకం ఉంటే.. విచారణకు తాము కూడా సిద్ధమేనని, అయితే ముందుగా తాను పెట్టిన షరతులను అంగీకరించాలని అన్నారు. డీఎస్సీపై సీబీఐ విచారణకు తమ ప్రభుత్వం.. మంత్రి నారా లోకేశ్ భయపడటం లేదని పేర్కొన్నారు. ఐదేళ్ల తర్వాత భారీ స్థాయిలో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టడంతో వైసీపీ నేతలు ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని సోమిరెడ్డి విమర్శించారు.జగన్ అక్రమాస్తుల కేసులు.. వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో సీబీఐ దర్యాప్తుపై వైసీపీ వైఖరిని సోమిరెడ్డి ప్రశ్నించారు. గతంలో సీబీఐ నమోదు చేసిన అక్రమాస్తుల కేసుల్లో వెల్లడైన అంశాలను వైసీపీ అంగీకరించాలని, వివేకా హత్య కేసులో సీబీఐ నిందితులుగా పేర్కొన్న వారిని కోర్టుకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. అలాగే సీబీఐ కోర్టుకు సమర్పించిన వాస్తవాలను అంగీకరించి, దర్యాప్తుపై దాఖలు చేసిన కౌంటర్లను వెనక్కి తీసుకోవాలని షరతు విధించారు. ఈ రెండు జరిగితే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడిని ఒప్పించి డీఎస్సీపై సీబీఐ విచారణకు సిద్ధం చేస్తానని సోమిరెడ్డి ప్రకటించారు. విచారణ అనంతరం క్లీన్‌చిట్ వచ్చినా వైసీపీ మళ్లీ అనుమానాలు వ్యక్తం చేస్తుందని ఆయన ఆరోపించారు.

## గోదావరి నదిలో పెరుగుతోన్న నీటిపరిమాణం.. హెచ్చరికల జారీ



**అమరావతి, రాజధాని వాయిస్ :** ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో గోదావరి నదిలో నీటిపరిమాణం స్వల్పంగా పెరుగుతోందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ నేపథ్యంలో ఉప్పొంగి ప్రవహిస్తున్న వాగులు, కల్వర్టులు, కాజ్‌వేల వద్ద ప్రమాదకర రీతిలో ప్రయాణాలు చెయ్యొద్దన్నారు. నదిలో స్నానానికి, ఈతకు, చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.శనివారం సాయంత్రం 6 గంటల నాటికి భద్రాచలం వద్ద నీటి మట్టం 29 అడుగులు, కూనవరం వద్ద నీటిమట్టం 13.6 మీటర్లు, పోలవరం వద్ద 9.31 మీటర్లు, ధవళేశ్వరం కాటన్ బ్యారేజి వద్ద ఇన్ ఫ్లో, ఔట్ ఫ్లో 5.19 లక్షల క్యూసెక్కులు ఉందని ప్రఖర్ జైన్ తెలిపారు. ఈ క్రమంలో ఆదివారం ధవళేశ్వరం బ్యారేజి వద్ద సుమారుగా 8-9 లక్షల క్యూసెక్కులు వరకు వరద ప్రవాహం చేరే అవకాశం ఉందన్నారు. ఆ తరువాత క్రమక్రమంగా తగ్గు ముఖం పట్టే సూచనలు ఉన్నాయని తెలిపారు. ఈ మేరకు వరద ప్రభావిత ప్రాంతాలైన తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, పశ్చిమగోదావరి, ఏలూరు, పోలవరం జిల్లాల యంత్రాంగాన్ని అప్రమత్తం చేశామన్నారు. అత్యవసర సేవలకు ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్‌డీఆర్‌ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్లు ఆయన వెల్లడించారు.మరోవైపు ఆదివారం శ్రీకాకుళం, అల్లూరి, పోలవరం జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు.

## లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

- 90 మందికి రూ.44.59 లక్షల సాయం
- వైద్య ఖర్చులకు ప్రభుత్వ అండ
- ఎల్వోసీ పత్రాల అందజేత
- ఆరోగ్య భద్రతే ప్రభుత్వ లక్ష్యం
- మంత్రి గొట్టిపాటి రవికుమార్



**అద్దంకి, రాజధాని వాయిస్ :** అద్దంకి ఆర్డీఓ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన ఆర్థిక సాయం చెక్కులు, ఎల్వోసీ పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో 90 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.44,59,687 విలువైన సహాయాన్ని పంపిణీ చేశారు. వైద్య ఖర్చుల భారం తగ్గించి ప్రజలకు అండగా నిలవడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పేద మరియు మధ్యతరగతి కుటుంబాలకు నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. అనారోగ్య పరిస్థితుల్లో కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోకుండా ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా అవసరమైన సాయం అందిస్తున్నామని చెప్పారు. ప్రజల ఆరోగ్య రక్షణకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పానికి అనుగుణంగా ప్రతి అర్హ కుటుంబానికి సకాలంలో సహాయం అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. అత్యవసర వైద్య చికిత్సలు, శస్త్రచికిత్సల కోసం అవసరమైన ఎల్వోసీ పత్రాలను వేగంగా మంజూరు చేసి బాధితులకు అందజేస్తున్నామని తెలిపారు. దీంతో అనేక కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గుతోందన్నారు. అనారోగ్యంతో ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న సమయంలో కుటుంబ సభ్యులు ఎదుర్కొనే కష్టాలను ప్రభుత్వం గుర్తించి సహాయక చర్యలు చేపడుతోందని మంత్రి చెప్పారు. వైద్య సేవల కోసం పెద్ద మొత్తంలో ఖర్చు చేయాల్సిన పరిస్థితులు రాకుండా సీఎంఆర్‌ఎఫ్ ద్వారా ఆర్థిక చేయూత అందిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని స్పష్టం చేశారు.లబ్ధిదారులు కూడా ప్రభుత్వ సహాయంపై సంతోషం వ్యక్తం చేశారు. అత్యవసర వైద్య అవసరాల సమయంలో అందిన ఆర్థిక సహాయం తమకు ఎంతో ఉపశమనాన్ని కలిగించిందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సేవలు పేద కుటుంబాలకు ఎంతో ఉపయోగపడుతున్నాయని అభిప్రాయ పడ్డారు. ప్రజల ఆరోగ్య సంరక్షణ, సంక్షేమం ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని మంత్రి మరోసారి స్పష్టం చేశారు. ఆపదలో ఉన్న ప్రతి కుటుంబానికి భరోసా కల్పిస్తూ, అవసరమైన సహాయం అందించేందుకు ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. ఈ కార్యక్రమం లో అధికారులు, ప్రజాప్రతినిధులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ఇంటికో పారిశ్రామికవేత్తే లక్ష్యం కేంద్ర మంత్రి పెమ్మసాని



గుంటూరు, రాజధాని వాయిస్ : ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్తను తీర్చిదిద్దడం, చిన్న వ్యాపారాలను ప్రోత్సహిం చడం ద్వారా మరిన్ని ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా 'వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి, సమాచార సాంకేతిక శాఖ సహాయ మంత్రి డా. పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు.శనివారం గుంటూరు లోని శ్రీ కన్వెన్షన్ సెంటర్ లో జిల్లా పరిశ్రమల శాఖ, ఏపీఐఐసీ, ఎంఎస్ఎంఈ శాఖల ఆధ్వర్యంలో 'వన్ ఫ్యామిలీ--వన్ ఎంటర్‌ప్రెన్యూర్' ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్ నిర్వహించారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ డెస్క్, బ్యాంకుల స్టాల్స్, ఎంఎస్ఎంఈ రిజిస్ట్రేషన్లకు ప్రత్యేక డెస్క్‌లను ఏర్పాటు చేశారు. వివిధ ప్రభుత్వ పథకాలు, రుణ సదుపాయాలు, సబ్సిడీలు, పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులపై అధికారులు అవగాహన కల్పించారు. బ్యాంకింగ్ రంగ నిపుణులు రుణాల మంజూరు, ప్రాజెక్టు నివేదికలు, వడ్డీ రేట్లు, రుణాల తిరిగి చెల్లింపు విధానాలపై ఔత్సాహికులకు వివరించారు.'వన్ ఫ్యామిలీ -- వన్ ఎంటర్‌ప్రెన్యూర్' వర్క్‌షాప్‌లో కేంద్ర మంత్రి మాట్లాడుతూ, వ్యాపార రంగంలో ఉన్నవారు తమ ఉత్పత్తుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. ఉత్పత్తుల్లో సృజనాత్మకత, విలువ జోడింపు, ఇతర ఉత్పత్తులతో పోలిస్తే ప్రత్యేకత ఉండేలా చూడాలన్నారు. వ్యాపారంలో నమ్మకం అత్యంత కీలకమని, తక్షణ లాభాల కోసం నాణ్యతలో రాజీ పడకూడదని కేంద్ర మంత్రి స్పష్టం చేశారు.ముఖ్యంగా వ్యాపారం ప్రారంభించిన తొలి రెండు, మూడు సంవత్సరాల్లో షార్ట్‌కట్‌లకు వెళ్లకుండా నాణ్యతను కాపాడుకుంటేనే దీర్ఘకాలంలో బలమైన బ్రాండ్‌ను నిర్మించుకోగలమన్నారు. ఉత్పత్తి అభివృద్ధితో పాటు సేల్స్, మార్కెటింగ్‌పై కూడా సమానంగా దృష్టి పెట్టాలని సూచించారు. మంచి ప్యాకేజింగ్, బ్రాండింగ్‌తో ఉత్పత్తులకు మార్కెట్‌ను విస్తరించుకోవచ్చన్నారు.స్థానికంగా లభించే ముడి పదార్థాలను ఉపయోగించుకుని విలువ జోడించిన ఉత్పత్తులను తయారు చేయడం ద్వారా వ్యాపార అవకాశాలను మరింతగా పెంచుకోవచ్చని తెలిపారు. గుంటూరు ప్రాంతంలో మిర్చి, పత్తి, ఇతర వ్యవసాయ ఆధారిత ఉత్పత్తులు విస్తారంగా లభిస్తున్నందున వాటికి విలువ జోడించి కొత్త ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేయాలని సూచించారు. ఇంటర్నెట్, వాట్సాప్ వంటి డిజిటల్ మాధ్యమాలను వినియోగించుకోవడంతో పాటు ఈ-కామర్స్ వేదికల ద్వారా స్థానిక ఉత్పత్తులను గుంటూరు పరిధిని దాటి దేశవ్యాప్తంగా, అంతర్జాతీయ మార్కెట్లకు చేరువ చేయడానికి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు.వ్యాపార విజయానికి నాణ్యమైన ఉత్పత్తి, వినియోగదారుల నమ్మకం, సృజనాత్మకత, విలువ జోడింపు, సమర్థవంతమైన మార్కెటింగ్ వంటి అంశాలు కీలకమని కేంద్ర మంత్రి పేర్కొన్నారు. వ్యాపారవేత్త లకు అవసరమైన సహకారం, మార్గదర్శకత్వం అందించేందుకు అందుబాటులో ఉంటామని తెలిపారు.

**గుంటూరు జిల్లాను ఎంఎస్ఎంఈ పవర్‌హౌస్‌గా తీర్చిదిద్దాలి..... జిల్లా కలెక్టర్ సాయి కాంత్ వర్మ**

ఎంఎస్ఎంఈ వర్క్‌షాప్‌లో కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో లక్షా 46 వేలకుపైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని, రాష్ట్రంలోని 26 జిల్లాల్లో అత్యధిక ఎంఎస్ఎంఈలు ఉన్న జిల్లా గుంటూరు అని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనల మేరకు ప్రతి కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్తను ప్రోత్సహించే కార్యక్రమానికి గుంటూరు జిల్లా నుంచే తొలి అడుగు పడాలని అన్నారు.

వ్యాపారం ప్రారంభించాలనుకునే ఔత్సాహికులు, ముఖ్యంగా మహిళా పారిశ్రామికవేత్తలకు అందుబాటులో ఉన్న అవకాశాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రుణ సదుపాయాలు, వివిధ పథకాలపై అవగాహన కల్పించేందుకు ఈ వర్క్‌షాప్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వ్యాపార ఆలోచనను విజయవంతమైన వ్యాపారంగా అభివృద్ధి చేసుకునేందుకు అవసరమైన సహాయ సహకారాలను అందించేందుకు అధికారులు, సంబంధిత సంస్థలు కృషి చేస్తున్నాయని తెలిపారు.ఔత్సాహికులు అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా గుంటూరు జిల్లాను ఎంఎస్ఎంఈ రంగంలో మరింత అభివృద్ధి చేసి పవర్‌హౌ స్‌గా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. ప్రతి కుటుంబం నుంచి ఒక విజయవంతమైన పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రజలు, అధికారులు, పరిశ్రమల ప్రతినిధులు సమష్టిగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.పత్తిపాడు శాసనసభ్యులు బూర్ల రామాంజనేయులు మాట్లాడుతూ ముఖ్యమంత్రి దార్శనికతకు నిదర్శనమే వన్ ఫ్యామిలీ వన్ ఎంటర్ప్రెనర్ కార్యక్రమమని అన్నారు. దేశానికే దిక్సూచిగా మారినటువంటి డ్వాక్రా మహిళా సంఘాల సృష్టికర్త చంద్రబాబు గారని అన్నారు. అందువల్ల రాబోయే రోజుల్లో కచ్చితంగా ఈ కార్యక్రమం విజయవంతమై ప్రతి ఇంటిలో పారిశ్రామికవేత్త తయారవుతారని తెలిపారు.

సీఐఐ ఏపీ చైర్మన్ నరేంద్ర కుమార్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈ రంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు కీలకమైన ఆధారంగా నిలుస్తోందన్నారు. గుంటూరు జిల్లాలో సుమారు 1.47 లక్షల ఎంఎస్ఎంఈ యూనిట్లు, రాష్ట్రవ్యాప్తంగా 9.3 లక్షలకు పైగా ఎంఎస్ఎంఈలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర జీఎస్‌డీపీలో ఎంఎస్ఎంఈల వాటా సుమారు 23.5 శాతం, రాష్ట్ర ఎగుమతుల్లో వాటా 28.3 శాతంగా ఉందన్నారు. ఎంఎస్ఎంఈ రంగంలో సూక్ష్మ పరిశ్రమలే ప్రధాన భాగస్వాములుగా ఉన్నందున వాటిని మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. సూక్ష్మ పరిశ్రమలను చిన్న పరిశ్రమలుగా, చిన్న పరిశ్రమలను మధ్యతరహా పరిశ్రమలుగా అభివృద్ధి చేయడంపై దృష్టి సారించాలని సూచించారు. తద్వారా స్థానికంగా పరిశ్రమల అభివృద్ధితో పాటు పెద్దఎత్తున ఉపాధి అవకాశాలు ఏర్పడతాయని తెలిపారు. గుంటూరు జిల్లాకు వ్యవసాయం, ఆహార శుద్ధి, వాణిజ్యం, రవాణా, లాజిస్టిక్స్, తయారీ, విద్య, సేవల రంగాల్లో బలమైన పారిశ్రామిక పునాది ఉందన్నారు.ఎంఎస్ఎంఈలు ఆధునిక సాంకేతికతను స్వీకరించాల్సిన అవసరం ఉందన్నారు. డిజిటల్ మార్కెటింగ్, వాట్సాప్, ఈ-కామర్స్, ఈఆర్‌పీ వ్యవస్థలు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, డేటా అనలిటిక్స్ వంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని వ్యాపార అవసరాలకు అనుగుణంగా వినియోగించుకోవాలని సూచించారు. సాంకేతికతకు భయపడకు ండా చిన్న స్థాయిలోనైనా వెంటనే ప్రారంభించాలని అన్నారు.సాంకేతిక పరిజ్ఞానం ద్వారా ఉత్పత్తి వ్యర్థాలను తగ్గించడం, ఖర్చులను నియంత్రించడం, నాణ్యతను మెరుగుపరచడం, ఉత్పత్తులను దేశ, విదేశీ మార్కెట్లకు చేరువ చేయడం సాధ్యమవు తుందని తెలిపారు. ఎంఎస్ఎంఈల అభివృద్ధికి ప్రభుత్వం, పరిశ్రమలు, ఆర్థిక సంస్థలు, సాంకేతిక సంస్థలు, విద్యాసంస్థల మధ్య వారధిగా పనిచేస్తూ, పాలసీ అడ్వకసీ, సాంకేతికత స్వీకరణ, నైపుణ్యాభివృద్ధి, మార్కెట్ అనుసంధానం, సామర్థ్య నిర్మాణ కార్యక్రమాల ద్వారా సహకారం అందించేందుకు సి ఐ ఐ కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమానికి గుంటూరు నగర మున్సిపల్ కమిషనర్ మయూర్ అశోక్, ఏపీ ఎంఎస్ఎంఈ సీఈఓ విశ్వ, ఏపీటీఎస్ చైర్మన్ మన్నవ మోహనకృష్ణ, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ వందనా దేవి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

# స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమిదే ఘనవిజయం



గుంటూరు, రాజధాని వాయిస్ : గుంటూరు పట్టణంలోని హోటల్ సిగ్నేచర్ డైన్ వేదికగా శనివారం స్థానిక సంస్థల ఎన్నిక లకు సంబంధించి కూటమి పార్టీ నేతల సమన్వయ కమిటీ సమా వేశం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించారు. ఈ సమావేశంలో తెదేపా, జనసేన, భాజపా కూటమి నాయకులు సంయుక్తంగా పాల్గొని, రాబోయే ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు.ఈ సమావేశంలో జిల్లా ఇంచార్జి మంత్రి కందుల దుర్గేష్, కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, జనసేన పార్టీ నాయకులు చిల్లపల్లి శ్రీనివాసరావు, గాదె వెంకటేశ్వర రావు,నాయబ్ కమల్, బిట్రగుంట మల్లిక, తెలుగుదేశం పార్టీ తరపున మంతెన సత్యనారాయణ రాజు, పిల్లి మాణిక్యాల రావు, అలాగే బీజేపీ నేతలు వల్లూరు జయప్రకాష్ నారాయణ, చెరుకూరి తిరుపతి రావు తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి శ్రేణులంతా సమైక్యంగా పనిచేసి, వంద శాతం స్ట్రైక్ రేట్‌తో అఖండ విజయం సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగాలని ముక్తకంఠంతో కూటమి నేతలు నిర్ణయించారు. కూటమి ధర్మాన్ని తూచా తప్పకుండా పాటిస్తూ, పార్టీలకంటే కూటమి అభ్యర్థుల గెలుపే ముఖ్యమనే ధ్యేయంతో క్షేత్రస్థాయిలో పని చేయాలని పిలుపునిచ్చారు.ఎన్నికల్లో ఎవరెవరు పోటీ చేయాలనే అంశంపై పార్టీల అధినేతల నిర్ణయానుగుణంగా స్పష్టమైన విధానాన్ని అనుసరిస్తామని స్పష్టం చేశారు.క్షేత్రస్థాయి పరిస్థితులు, బలాబలాలపై ఇప్పటికే సమగ్ర నివేదికలు సిద్ధం చేశామని, ఎలాంటి పొరపొచ్చాలకు, అపార్థాలకు తావులేకుండా సమన్వయంతో ఎన్నికలను ఎదుర్కొంటామని కూటమి నేతలు ధీమా వ్యక్తం చేశారు.

# ప్రత్యేక గ్రీవెన్స్ అర్జీలపై ప్రత్యేక దృష్టి: జేసీ



గుంటూరు, రాజధాని వాయిస్ దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు నిర్వహించే ప్రత్యేక గ్రీవెన్స్ లో అందిన అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ అన్నారు. దివ్యాంగులకు, ఉద్యోగులకు, ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక గ్రీవెన్స్ ను శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో గల ఎస్. ఆర్. శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. అభ్యర్థుల నుండి అర్జీలు స్వీకరించారు. అభ్యర్థుల విన్నపాలను ఆలకించారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజా వలి, డిప్యూటీ కలెక్టర్ లు గంగ రాజు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## కలంతో సమానత్వాన్ని చాటిన కవి జాషువా: ఎమ్మెల్యే రామాంజనేయులు




గుంటూరు, రాజధాని వాయిస్ గుంటూరు, సంతోష్ నగర్,1 లైన్, కార్డ్స్ ఆర్నాల్డ్ పౌలస్ ఆడిటోరియం నందు కవి కోకిల, నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 131 వ జయంతి సందర్భంగా జాషువ కల్చరల్ సెంటర్ వారి ఆధ్వర్యంలో జాషువా సాహితీ పురస్కార ప్రధానోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాడు నియోజకవర్గ శాసనసభ్యులు డా. బూర్ల రామాంజనేయులు.ఈ సందర్భంగా శాసనసభ్యులు వారు మాట్లాడుతూ కుల, మత, వర్గ భేదాలకు అతీతంగా మానవత్వమే మహోన్నతమని తన సాహిత్యం ద్వారా చాటిన మహాకవి గుర్రం జాషువా అని, ఆయన రచనలు అణగారిన వర్గాల్లో ఆత్మగౌరవాన్ని, సామాజిక చైతన్యాన్ని నింపాయని, జాషువా కలం కేవలం కవిత్వాన్ని సృష్టించలేదని, సమాజాన్ని ప్రశ్నించే చైతన్యాన్ని, సమానత్వాన్ని కోరే స్వరాన్ని, మానవత్వాన్ని కాపాడే సందేశాన్ని అందించిందని అన్నారు.ఆయన సాహిత్యం నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా సాహిత్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న వారికి జాషువా సాహితీ పురస్కారాలను ప్రదానం చేశారు.సాహిత్యాన్ని, తెలుగు భాషను, జాషువా ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు చేస్తున్న కృషిని ఎమ్మెల్యే అభినందించారు.జాషువా ఆశయాలను, సాహితీ స్ఫూర్తిని భావితరాలకు అందించేందుకు జాషువా కల్చరల్ సెంటర్ నిర్వహిస్తున్న , కళారత్న పి.వి రమణ కృషి అభినందనీయమని పేర్కొంటూ, ఈ కార్యక్రమాన్ని ఇంత ఘనంగా నిర్వహిస్తున్న నిర్వాహకులకు ఎమ్మెల్యే హృదయపూర్వక అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జాషువా అభిమానులు, విద్యార్థులు, మరియు తదితరులు పాల్గొన్నారు.

# 'బ్రిడ్జ్ మ్యాన్ ఆఫ్ గుంటూరు' పెమ్మసాని: ఎమ్మెల్యే మాధవి




గుంటూరు,రాజధాని వాయిస్ : గుంటూరు నగరానికి అనతి కాలంలోనే అనేక ఆర్వోబిలను మంజూరూ చేయించి, గుంటూరులో కోట్లాది రూపాయల అభివృద్ధి పనులను ముందుకు తీసుకెళ్తూ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చుతున్న ఆయనను "బ్రిడ్జ్ మ్యాన్ ఆఫ్ గుంటూరు"గా ఎమ్మెల్యే గళ్ళా మాధవి అభివర్ణించారు.శనివారం గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్--గడ్డిపాడు రైల్వే లెవల్ క్రాసింగ్ (ఎల్‌సీ-3) వద్ద నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబి) పనులకు కేంద్ర రైల్వే, జలశక్తి శాఖ సహాయ మంత్రి శ్రీ వి. సోమన్న, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే ఒ టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి తదితర ప్రజాప్రతినిధులు శంకుస్థాపన చేశారు. అనంతరం గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శిలాఫలక ఆవిష్కరణతో పాటు సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ... కేంద్ర మంత్రి వి. సోమన్నకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి గుంటూరు జిల్లాలో అభివృద్ధి పనులు వేగంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొన్నారు. జిల్లాలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విశేష ప్రాధాన్యత ఇస్తుండటం ఆనందంగా ఉందన్నారు.గుంటూరు నగరం నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లేవారికి, అలాగే బయట ప్రాంతాల నుంచి నగరంలోకి వచ్చే ప్రజలకు ఈ వంతెన కీలకంగా మారనుందని చెప్పారు. ఇప్పటికే శంకర్ విలాస్ ఆర్‌ఓబి నగర రవాణాకు ఎంతగానో ఉపయోగపడుతుండగా, ఇప్పుడు నిర్మాణం చేపడుతున్న గడ్డిపాడు ఆర్‌ఓబి కూడా ట్రాఫిక్ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా నిలుస్తుందన్నారు. ఇలాంటి కీలక వంతెనల నిర్మాణాన్ని సవాలుగా స్వీకరించి కార్యరూపం దాల్చేలా కృషి చేస్తున్న డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కొనియాడారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేస్తున్నాయని పేర్కొన్నారు. గుంటూరు అభివృద్ధికి నిరంతరం సహకరిస్తున్న కేంద్ర మంత్రి వి. సోమన్న, కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో పాటు ఈ కార్యక్రమానికి సహకరించిన ప్రతి ఒక్కరికీ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలిపారు.

# ఆత్మగౌరవానికి ప్రతీక ఐలమ్మ: ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, రాజధాని వాయిస్ : చిట్యాల ఐలమ్మ ఒక వ్యక్తి మాత్రమే కాదని, ధైర్యానికి, సాహసానికి, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన మహనీయురాలని, ఒకే సామాజిక వర్గానికి పరిమితమైన నాయకురాలిగా కాకుండా, ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన గొప్ప స్ఫూర్తి ప్రదాతగా ఆమెను గుర్తిస్తున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.శనివారం గుంటూరు నగరంలోని 43వ డివిజన్ చంద్రమౌళినగర్ పోస్టాఫీస్ సమీపంలో వీరనారి చిట్యాల ఐలమ్మ 131వ జయంతి సందర్భంగా ఆమె విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమానికి గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యురాలు గళ్ళా మాధవి ముఖ్య అతిథిగా పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ.. తెలుగుదేశం పార్టీ బీసీ వర్గాలకు రాజకీయ అవకాశాలు, ప్రాతినిధ్యం కల్పిస్తూ వస్తోందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. తనకు ఎమ్మెల్యేగా మాత్రమే కాకుండా పార్టీ అత్యున్నత నిర్ణయాత్మక వేదికైన పొలిట్ బ్యూరో సభ్యురాలిగా అవకాశం కల్పించడం పట్ల టీడీపీ, కూటమి నాయకత్వానికి ఎల్లప్పుడూ రుణపడి ఉంటానన్నారు.ఈ ప్రభుత్వ హయాంలోనే బీసీ వర్గాల ఆశలు, ఆకాంక్షలు నెరవేరుతాయనే విశ్వాసం వ్యక్తం చేశారు. బీసీ వర్గాలు ఎదుర్కొంటున్న వెనుకబాటుతనం, సామాజిక, ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.బీసీ రక్షణ చట్టం, సంక్షేమ పథకాలు, పెన్షన్ల వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని చెప్పారు. వివిధ సామాజిక వర్గాల ప్రజల ఆశలు, అభ్యర్థనలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి సాధనకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో సమాజానికి సేవ చేసే నాయకులుగా ఎదగాలని ఆకాంక్షిస్తూ, కార్యక్రమాన్ని విజయవంతం చేసిన నిర్వాహకులు, కమిటీ సభ్యులు, పెద్దలకు ఎమ్మెల్యే గళ్ళా మాధవి కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వడ్డెర కార్పొరేషన్ చైర్మన్ మల్లె ఈశ్వరరావు, వివిధ సామాజిక వర్గాల నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

# పిక్సెల్స్ అయినా, పైపులైనా.. లక్ష్యం ఒక్కటే 'ది ప్రింట్' కథనంపై సీఎం చంద్రబాబు స్పందన



అమరావతి, రాజధాని వాయిస్ : ప్రముఖ ఆంగ్ల మీడియా సంస్థ 'ది ప్రింట్' వ్యవస్థాపకుడు శేఖర్ గుప్తా పెట్టిన ఓ సోషల్ మీడియా పోస్టుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పందించారు. తన పాలనా విధానం, ప్రాధాన్యతలపై జరుగుతున్న విశ్లేషణపై ఆయన తన అభిప్రాయాలను స్పష్టంగా పంచుకున్నారు. 'పిక్సెల్స్ నుంచి పైపుల వైపు' సాగుతున్న తన ప్రయాణం వెనుక ఉన్న ఉద్దేశాన్ని వివరిస్తూ, అభివృద్ధి ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరాలన్నదే తన స్థిరమైన నమ్మకమని పునరుద్ఘాటించారు.'ది ప్రింట్' మీడియాలో వచ్చిన ఒక కథనాన్ని శేఖర్ గుప్తా ప్రస్తావిస్తూ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. చంద్రబాబు తన 'సీఈఓ-సీఎం' ఇమేజ్‌ను మార్చుకుని, గ్రామీణ ప్రాంతాల్లో టీడీపీకి ఆదరణ పెంచుకునేందుకు 'పిక్సెల్స్' (టెక్నాలజీ) నుంచి 'పైపుల' (సాగునీటి) వైపు ఎలా పయనిస్తున్నారనే విశ్లేషణ ఆ కథనంలో ఉంది. ఈ పోస్టుపై స్పందించిన చంద్రబాబు, తన రాజకీయ ప్రస్థానం వెనుక ఉన్న మూల సిద్ధాంతాన్ని తెలియజేశారు.ఈ సందర్భంగా చంద్రబాబు స్పందిస్తూ, "నా ప్రజా జీవితం ఒకే ఒక్క నమ్మకం చుట్టూ ముడిపడి ఉంది. అభివృద్ధి ఫలాలు కచ్చితంగా ప్రజల దైనందిన జీవితాలను మెరుగుపరచాలి. 1990లలో మారుతున్న ఆర్థిక వ్యవస్థకు అనుగుణంగా టెక్నాలజీ పర్యావరణ వ్యవస్థను నిర్మించడం, కొత్త అవకాశాలు సృష్టించడం నా ముందున్న కర్తవ్యం. కానీ, ఈ రోజు నా ప్రాధాన్యత మరింత మౌలికమైనది. దశాబ్దాలుగా ఎదురుచూస్తున్న మన రైతులకు, ముఖ్యంగా చివరి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించడమే నా ముందున్న అతిపెద్ద లక్ష్యం" అని వివరించారు."అది పిక్సెల్స్ అయినా, పైపులైనా.. రెండింటి ఉద్దేశం ఒక్కటే. ప్రజల సమస్యలను పరిష్కరించడం, వారి జీవనోపాధిని బలోపేతం చేయడం, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి కుటుంబానికి మెరుగైన భవిష్యత్తును నిర్మించడం" అని చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రయాణాన్ని కథనంలో చక్కగా వివరించినందుకు శేఖర్ గుప్తాకు, 'ది ప్రింట్' మీడియాకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా చంద్రబాబు 'హైటెక్ సీఎం'గా, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీకి పెద్దపీట వేసిన నేతగా గుర్తింపు పొందారు. అయితే, ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో వ్యవసాయ రంగం, సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించడం ద్వారా గ్రామీణ ప్రజలకు మరింత చేరువయ్యేందుకు ఆయన ప్రయత్నిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. తన పాలనా ప్రాధాన్యతలు కాలానికి అనుగుణంగా మారతాయే తప్ప, ప్రజలకు సేవ చేయాలనే అసలు లక్ష్యం మాత్రం మారదని చంద్రబాబు తన స్పందన ద్వారా స్పష్టం చేశారు.

## మురికివాడల్లేని పట్టణాన్ని నిర్మించడమే లక్ష్యం

ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి



**మాచర్ల.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్** :మురికివాడల్లేని మాచర్ల పట్టణాన్ని నర్మించడమే లక్ష్యమని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 6,7,8,10వ వార్డుల నందు ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. వార్డుల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీరు, విద్యుత్ సరఫరాలు వంటి పలు సమస్యలపై మున్సిపాల్ అధికారులతో సమీక్షించారు. స్థానికులతో మాటామంతి నిర్వహించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వార్డుల్లో చేపట్టిన అమృత్ స్కీం పనులను పరిశీలించారు. 8వ వార్డు నూతనంగా నిర్మిస్తున్న వాటర్ ఓవర్ హెడ్ ట్యాంకును పరిశీలించారు. అనంతరం పలువురుని పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారులు గబ్రూనాయక్, మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, టీడీపీ నాయకులు యాగంటి మల్లికార్జునరావు, కజ్జం సైదయ్య, మద్దిగపు వెంకటరామిరెడ్డి, యెనుముల కేశవరెడ్డి, రాజబోయిన మధు, కొమెర దుర్గారావు, శశిరెడ్డి, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు లాల్ కిషన్, నర్రా రాముడు, కమాలకర్, భాగం హనుమంతరావు, వంకయాలపాటి రాజు కుమార్, చల్లా సాంబ తదితరులు పాల్గొన్నారు

## మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివి ఎమ్మెల్యే జూలకంటి



**మాచర్ల.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్** :పట్టణానికి మున్సిపల్ సిబ్బంది అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి వెల్లడించారు. శనివారం స్థానిక మున్సిపాలిటి నందు 30 మంది పర్మినెంట్ మున్సిపల్ సిబ్బందికి ఎమ్మెల్యే చేతుల మీదిగా నూతన యూనిఫాం వస్త్రాల ను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,కరోనా సమయంలో మున్సిపల్ సిబ్బంది అందించిన సేవలు మరవలేని విని చెప్పారు. అర్హులైన సిబ్బందికి కచ్చితంగా నివేశ స్థలాలను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వేణుబాబు, కజ్జం సైదయ్య, కొమెర దుర్గారావు, మద్దిగపు వెంకటరామిరెడ్డి, కంభపాటి అనిల్ కుమార్, బీజేపీ నాయకులు క్రాంతి కుమార్, జనసేన నాయకులు కొమర లాల్ కిషన్, అవినాష్ రెడ్డి, కొమెర శివ తదితరులు పాల్గొన్నారు.

## హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన



**చిలకలూరిపేట. సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :** స్థానిక మున్సిపల్ పాఠశాలలో ప్రిన్సిపాల్ పి. సుధారాణి ఆధ్వర్యంలో, క్యాంపు-పియు స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఐఈసీ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా హాస్పిటల్ ఐసీటీసీ కౌన్సిలర్ కె. హనుమంత్ రావు మాట్లాడుతూ, హెచ్ఐవీ వ్యాప్తి చెందే మార్గాలు, నివారణ జాగ్రత్తలు, క్షయ-లైంగిక వ్యాధులపై వివరించడంతో పాటు బాధితుల పట్ల వివక్ష చూపవద్దని సూచించారు. అనంతరం సంస్థ మేనేజర్ కొండా పవన్ కళ్యాణ్ పాంప్లెట్‌లోని సమాచారం, రిస్క్ అసెస్‌మెంట్ క్యూఆర్ కోడ్ వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో క్యాంపు ఔట్‌రీచ్ వర్కర్ పోలమ్మ, పాఠశాల ఇన్‌చార్జ్ ఎం. అరుణదేవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## జిల్లా ఆర్యవైశ్య మీడియా వైస్ చైర్మన్‌గా చెన్నకేశవరావు



దుర్గి.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :పల్నాడు జిల్లా ఆర్యవైశ్య ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియా వైస్ చైర్మన్‌గా దుర్గికి చెందిన ఓబుల్ శెట్టి చెన్నకేశవరావు నియమితులయ్యారు. జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చందోలు వెంకటకృష్ణ సూర్యప్రకాష్ రావు ఆయనకు ఈ నియామక ఉత్తర్వులు అందజేశారు. సమాజ సేవలో, ప్రజా సమస్యల పరిష్కారంలో మీడియా పాత్ర కీలకమని, విలేకరుల సంక్షేమం, మీడియా బలోపేతానికి చెన్నకేశవరావు కృషి చేయాలని ఈ సందర్భంగా అధ్యక్షుడు ఆకాంక్షించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపిన చెన్నకేశవరావు, మీడియా ప్రతినిధులను సమన్వయం చేస్తూ సంఘాభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తానని స్పష్టం చేశారు. ఆయన నియామకంపై స్థానిక, జిల్లా ఆర్యవైశ్య ప్రముఖులు, జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు.

## టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ కార్యక్రమం



**మాచర్ల. సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :** పట్టణంలోని 8వ వార్డులో టీడీపీ ఆధ్వర్యంలో ఇంటింటికీ కార్యక్రమాన్ని నిర్వహించారు. మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. 8వ వార్డు ఇన్‌చార్జ్ కజ్జం సైదయ్య, వార్డు అధ్యక్షులు మద్దిగపు శ్రీనివాసరెడ్డి (బుల్లిరెడ్డి), ఉపాధ్యక్షుడు వంకాయలపాటి నరేష్ కుమార్, 67వ బూత్ ఇన్‌చార్జ్ వంకాయలపాటి రాజీవ్ కుమార్ పాల్గొని వార్డులోని పలు ప్రాంతాల్లో ఇంటింటికీ వెళ్లారు. ఈ సందర్భంగా ప్రజలను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై ప్రజలకు వివరించారు. వార్డులోని సమస్యలను సంబంధిత నాయకుల దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మాచర్లలో రాజకీయ పార్టీలతో ఎస్ఐఆర్‌పై సమావేశం



**మాచర్ల.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్** :జిల్లా రెవెన్యూ అధికారి, 101-మాచర్ల అసెంబ్లీ నియోజకవర్గం ఈఆర్ఓ ఆదేశాల మేరకు శనివారం మాచర్ల తహశీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఏఈఆర్ఓలు, తహశీల్దార్‌తో సమావేశం నిర్వహించారు. సాయంత్రం 5 గంటలకు జరిగిన ఈ సమావేశంలో ఎస్ఐఆర్ షెడ్యూల్, విచారణలు (హియరింగ్స్),వాటిని నిర్వహించే విధానం తదితర అంశాలపై చర్చించారు. అలాగే పెండింగ్‌లో ఉన్న ఫారం-6,ఫారం-7,ఫారం-8 దరఖాస్తుల పరిశీలన, వాటిపై చేపట్టాల్సిన తదుపరి చర్యలపై అధికారులు రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని వర్గాల సహకారం అవసరమని సమావేశంలో సూచించారు.

## పోలీసులు భయాన్ని కాదు.. భరోసా కల్పించాలి. మంత్రి ఎస్. సవిత





**కడప.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :** కడప బాకరాపేటలోని 11వ బెటాలియన్ పరేడ్ మైదానంలో శిక్షణ పూర్తి చేసుకున్న 521 మంది కానిస్టేబుళ్ల దీక్షాంత్ పరేడ్ శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన బీసీ సంక్షేమ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఎస్. సవిత మాట్లాడుతూ, పోలీసులు క్రమశిక్షణ, నిజాయితీ, మానవత్వంతో విధులు నిర్వర్తించి ప్రజల్లో భరోసా నింపాలని పిలుపునిచ్చారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల కట్టడికి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని సూచించారు. కూటమి ప్రభుత్వం పోలీసుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తోందని, బడ్జెట్‌లో పోలీస్ రక్షణ రంగానికి రూ.9,165 కోట్లు కేటాయించడంతో పాటు శిక్షణార్థుల స్టైపెండ్‌ను రూ.4,500 నుంచి రూ.12 వేలకు పెంచామని తెలిపారు. ఇప్పటికే 6,100 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేశామని, త్వరలోనే మరో 2 వేలకు పైగా ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయనున్నట్లు వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. అనంతరం కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ షెల్కే నచికేత్‌లతో కలిసి ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుళ్లకు మంత్రి పురస్కారాలు అందజేశారు.

## డీఎస్సీ నిరసనలపై అక్రమ కేసులు, అరెస్టులు ఆపాలి

### - డీసీపీకి వైసిపి నేతల వినతి



**విజయవాడ.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్** :డీఎస్సీ అభ్యర్థుల శాంతియుత నిరసనలపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడుతోందని ఆరోపిస్తూ వైఎస్సార్‌సీపీ నేతలు విజయవాడ డీసీపీ సరితకు వినతిపత్రం అందజేశారు. ఈనెల 21న విజయవాడ శాప్ కార్యాలయం వద్ద శాంతియుతంగా నిరసన తెలిపిన తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు, నిరుద్యోగులపై తప్పుడు కేసులు నమోదు చేశారని, అర్ధరాత్రి అరెస్టులతో కుటుంబ సభ్యులను భయాందోళనలకు గురిచేస్తున్నారని నేతలు వినతిపత్రంలో పేర్కొన్నారు. నిరుద్యోగుల పక్షాన నిలిచిన వారిపై సెక్షన్ 307తో పాటు ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ వంటి తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయడాన్ని వారు తీవ్రంగా ఆక్షేపించారు. ప్రశ్నించే గొంతులను పోలీసు కేసులు, నిర్బంధాలతో అణచివేయ లేరని స్పష్టం చేసిన నేతలు, ఆయా కేసులను తక్షణమే పునఃసమీక్షించి ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో పోలీసుల వైఖరికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్త ఆందోళనలు చేపడతామని వైసిపి నేతలు తెలిపారు.

## కృత్రిమ మేధతో సమస్యలకు పరిష్కారాలు చూపాలి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



**నరసరావుపేట.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్** :యువతకు ఉపాధి అవకాశాలు కల్పించి భరోసా ఇవ్వడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. యువత భవితకు భరోసా లో భాగంగా పట్టణంలోని ఎస్ఎస్ అండ్ ఎన్, పీఎన్సీ అండ్ కేఆర్, ఎంఏఎం ఇంజినీరింగ్, కృష్ణవేణి కళాశాలల సదస్సుల్లో ఆయన ప్రసంగించారు. కేవలం డిగ్రీలతో సరిపెట్టుకోకుండా కృత్రిమ మేధ, సమాచార విశ్లేషణ, రోబోటిక్స్ వంటి ఆధునిక సాంకేతికతలపై పట్టు సాధించాలని సూచించారు. కృత్రిమ మేధతో ఉద్యోగాలు పోతాయన్న భయం వీడి, సమాజ సమస్యలకు వినూత్న పరిష్కారాలు చూపే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామకాలు పారదర్శకంగా జరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాలల యాజమాన్యాలు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికల భద్రతపై సమీక్ష

**శ్రీకాకుళం, రాజధాని వాయిస్ :** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, మహిళల భద్రత, రహదారి భద్రత, మాదక ద్రవ్యాల నిర్మూలన అంశాలపై విశాఖపట్నం పరిధి పోలీసు ప్రధాన అధికారి గోపీనాథ్ జట్టి సమగ్ర సమీక్ష నిర్వహించారు. దృశ్య మాధ్యమం ద్వారా జరిగిన ఈ సమావేశంలో శ్రీకాకుళం జిల్లా పోలీసు అధికారి కె.వి. మహేశ్వర రెడ్డితో పాటు అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, పోలవరం, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా ఆదేశించారు. పోలీసు శాఖలోని సిబ్బంది వివరాలు, సేవలకు సంబంధించిన సమాచారం మొత్తం వ్యవస్థలో సక్రమంగా నమోదు చేయాలని, పెండింగ్ అంశాలను వ్యక్తిగతంగా పర్యవేక్షించాలని సూచించారు. మహిళలు, బాలలపై జరిగే నేరాలకు సంబంధించిన కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, బాలికల అదృశ్యం, లైంగిక దాడులు, వరకట్న మరణాల వంటి ఘటనల్లో కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహిళల భద్రత విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని స్పష్టం చేశారు. రహదారి ప్రమాదాలను తగ్గించేందుకు ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రమాదాల కారణాలను విశ్లేషించి తగిన భద్రతా చర్యలు అమలు చేయాలని, ప్రమాదం సృష్టించి పరారయ్యే వారిని సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో త్వరగా గుర్తించాలని ఆదేశించారు. ప్రజల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సమావేశంలో స్పష్టం చేశారు.

## సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు కార్పొరేట్ వైద్యం మంత్రి గొట్టిపాటి



**అద్దంకి.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :** పేద, మధ్య తరగతి వారికి కార్పొరేట్ వైద్యం అందించాలన్న లక్ష్యంతో సీఎం చంద్రబాబు నాయుడు సీఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సాయం చేస్తున్నారని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అద్దంకి ఆర్డీఓ కార్యాలయంలో శనివారం 90 మంది లబ్ధిదారులకు రూ.44.59 లక్షల విలువైన చెక్కులను ఆయన పంపిణీ చేశారు. ఇందులో 85 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఐదుగురికి ఎల్వోసీలు అందజేశారు. ఇప్పటివరకు నియోజకవర్గంలో 4,006 మందికి మొత్తం రూ.32.41 కోట్ల విలువైన సీఎంఆర్ఎఫ్ సాయంఅందించి పేదలను ఆదుకున్నామని మంత్రి వివరించారు.

## హెల్మెట్ ధారణతోనే ప్రాణరక్షణ ఎస్ఐ బి. గోపాల్



**దుర్గి.సెప్టెంబరు 26రాజధాని వాయిస్** :ద్విచక్ర వాహనదారులు విధిగా నాణ్యమైన హెల్మెట్ ధరించి ప్రయాణించాలని, తద్వారా రోడ్డు ప్రమాదాల బారిన పడినప్పుడు ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని దుర్గి ఎస్ఐ బి. గోపాల్ పేర్కొన్నారు. స్థానిక మెయిన్ సెంటర్‌లో ప్రజలకు, వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలు, హెల్మెట్ ప్రాముఖ్యతపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రయాణాల్లో వేగ నియంత్రణ పాటిస్తూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలకు లోబడి బాధ్యతాయుతంగా వాహనాలు నడపాలని సూచించారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపడం, మితిమీరిన వేగంతో వెళ్లడం ప్రాణాంతకమని హెచ్చరించారు. ప్రజల ప్రాణాల రక్షణే పోలీసుల ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేస్తూ, ప్రమాదాల నివారణకు వాహనదారులు, పాదచారులు నిబంధనలు పాటిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు.

## పిన్నెల్లి సమక్షంలో వైసిపిలో చేరిన మాజీ కౌన్సిలర్ షేక్ దస్తగిరి



**మాచర్ల.సెప్టెంబర్ 26 రాజధాని వాయిస్ :** మాచర్ల పట్టణానికి చెందిన ప్రముఖ మైనారిటీ నాయకుడు, 26వ వార్డు మాజీ కౌన్సిలర్ షేక్ దస్తగిరి తెలుగుదేశం పార్టీని వీడి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. పట్టణంలోని వైయస్సార్‌సీపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పల్నాడు జిల్లా వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాచర్ల మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు షేక్ దస్తగిరి పార్టీలో చేరడంతో పట్టణంలో పార్టీ మరింత పటిష్టమవుతుందని నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

## అమరావతి పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్చార్జిగా గన్నెపల్లి ప్రసన్న నియామకం



**గురజాల.సెప్టెంబర్ 26.రాజధాని వాయిస్ :** అమరావతి పార్టీ గురజాల నియోజకవర్గ ఇన్చార్జి గా గన్నెపల్లి ప్రసన్న ను నియమిస్తూ అమరావతి పార్టీ ఏపీ వర్కింగ్ ప్రెసిడెంట్ నవులూరి శివారెడ్డి శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా శివారెడ్డి మాట్లాడుతూ, అమరావతి పార్టీ అధినేతృత్వం మీద నమ్మకంతో, పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కృషి చేయాల్సిందిగా గన్నెపల్లి ప్రసన్న ను హార్ధికంగా అభినందిస్తున్నామని అన్నారు.

PRINTED, PUBLISHED AND OWNED BY PAGALA PURNA CHANDRA RAO. MUTUKURU (POST) DURGI MANDAL MACHERLA CONSTITUENCY. PALNADU DISTRICT.AP.DOOR N0 0-004 PINCODE 522612 PHONE NUMBER 9030343195. PRINTED AT SRI KANAKA BHARGAV OFF-SET PRINTERS. MAIN ROAD ANJANEYA COLONY REDDYPALEM GUNTUR 522009 ANDHRA PRADESH . EDITOR :PAGALA PURNA CHANDRA RAO
RNI NO :APTEL/2023/90201PHONE NUMBER : 9030343195.EMAIL. rajadhanivoicedaily@gmail.com